కథానిక:

# ఆడపిల్ల తండ్రి

"విషాది"

గంగాధరం రుసరుసలాడుతూ ఇంట్లో కొచ్చాడు.

అప్పుడే మన్నీళ్ళెత్తుకొని వస్తూన్న రాజమ్మ కేమీ అర్థం కాలేదు. ఎందుకంత కోపంతో గ్రామాంతరాన్నుంచి వొచ్చాడో భర్త!

"వెధవకాలం...వెధవ వేషాలు ... పాడలవాట్లూనూ" అంటూ నెత్తికి చుట్టుకున్న ఉత్తరీయాన్ని తీసి వంకెన పెడుతున్నాడు.

కాళ్ళకు నీళ్ళివ్వటానికి దొడ్లోకి పోయింది రాజమ్మ.

ముఖంమీది చెమట తుడుచుకుంటూ విసుగ్గా కూలబడ్డాడు గంగాధరం.

"ఏమిటండీ? మహా విసుగ్గావచ్చారు? ఏమైం దేమిటి?" అంటూ ఇత్తడి చెంబుతో నీళ్ళు తెచ్చి అక్కడ పెట్టింది రాజమ్మ.

"ఏమి టేమిటి? ఆ వెధవ...వాడు లేడూ... రామశర్మకొడుకు..ఉత్తమొద్దు - వాడికీ కావాలట! వేలు..."

"మరి వెంకటేశ్వర్రా వేమన్నాడండీ?"

"చెట్టెక్కి కూర్చున్నాడు."

"అసలు ఎంత కావాలన్నాడు కట్నం?"

"పదివేలు..."

"మరి ఇంకెక్కడన్నా వెతక్క పోయారా?"

"చచ్చేట్టు కట్టిన గడపల్లా తిరిగాను; మగపిల్లవాడున్నాడన్న కొంపలంతా తిరిగాను..."

"ఎక్కడా సంబంధం కుదరనే లేదండీ!"

మొలతాడు గట్టిన వాడల్లా వేలమీదనే కూర్చుండె! వేలుంటే కుదరటానికేం...?"

"ఏదో మనకు తగ్గదే చూడక పోయారూ?"

"నీకు చెపితే అర్థం కావటంలేదే? పిచ్చి మొద్దు!"

"అర్థ మేమిటండీ? ఇంతకూ కుదర లేదంటారు అంతేగా."

"ఆహా"

అన్నం మెత్తనౌతుందేమోనని గొణుగుకుంటూ వంటింట్లోకి పోయింది రాజమ్మ.

ఈ సంభాషణలో మెత్తనే అయింది కూడు కాస్తా -!

పొగాకుపట్టా ముందేసుకొని చుట్ట చుట్టుకుంటూ నిప్పు తెమ్మని కేకేశాడు గంగాధరం.

గంటెతో నిప్పు తెచ్చిస్తూ "ఇంతకూ



దానికి పెండ్లిగీత పెట్టుకోరా లేదేమో" అన్నది రాజమ్మ విచారంగా.

గంటె అందుకొని "దాని గీత ఎట్లా ఉందో?" అన్నాడు గంగాధరం.

"ఈ వైశాఖమాసంలోనైనా ముడిపడితే బాగుండు" అంది రాజమ్మ.

"అదే చూస్తున్నాను. కాళ్లరిగేటట్టు తిరుగుతున్నా నా మరి?" అన్నాడు గంగాధరం.

"ఇంతకూ దాని రాత, ఎటువంటివాడు దొరకుతాడో?" అంటూ లోపల కెళ్లింది రాజమ్మ.

చుట్టను పీలుస్తూ, ఉమ్మేస్తూ, ఆలోచనలో పడ్డాడు గంగాధరం.

"స్నానానికి లేవండి. వంటైంది" అని కేకేసింది లోపలనుంచి రాజమ్మ.

"అమ్మా యెక్కడికి పోయిందే?" అంటూ చుట్టపారేసి లోపలకు పోయాడు గంగాధరం.

* * *

పిల్లను చూట్టానికి అగ్రహారంనుంచి వచ్చారు. రాజమ్మకు అంతులేని పని. హడావుడిగా అటూ ఇటూ తిరుగుతూ వారికి కావలసినవన్నీ సమకూరుస్తున్నది.

గంగాధరం పిచ్చాపాటీ వచ్చినవాళ్లతో మాట్లాడుతున్నాడు వాళ్ళ ప్రక్క కూర్చొని.

ఎదురుగా చాప వేసివుంది.

"అమ్మాయిని తీసుకొనిరావే!" అని కేకేశాడు రాజమ్మని మాటలాపుజేసి.

పిల్లను ముస్తాబుతో తీసుకొనివచ్చింది రాజమ్మ. సిగ్గుతో తల వంచుకొని కూర్చుంది చాపమీద పిల్ల.

"మీ పిల్లకు చదువచ్చునా? ఏమండీ?" అని ప్రశ్నించాడు పెండ్లికొడుకు పినతండ్రి.

"ఆ! తెనుగు చదవంతా వచ్చు. కాస్తో కూస్తో సంగీతంకూడా వచ్చు" అన్నాడు గంగాధరం.

"ఇంగ్లీషు అసలు రాదా?" అని ప్రశ్నించాడు పెండ్లికొడుకు.

"పల్లెటూరిపిల్లకు ఇంగ్లీషు ఎట్లా వస్తుంది? అయినా ఇంగ్లీషు ఆడపిల్లల కెందుకు?" అన్నాడు గంగాధరం కొంచెం వ్యంగంగా—

"మరి కట్నమేమిస్తారు?" అని అడిగాడు పెండ్లికొడుకు పినతండ్రి.

"ఏదో వెయ్యినూటపదహార్లు ఇద్దామని. నేనూ, ఇప్పుడు చాలా చితికిపోయి వున్నాను - ఇదివరకు మా పెద్దలున్నప్పటిలాగా లేదాయ సంసారం. ఉన్న ఆస్తి నంతటినీ వాళే పాడుచేసిరి. అయినా యీ రోజుల్లో డబ్బుకు మహా కిటకిటగా వుంది. నేనేమో చేతులు ముందర పెట్టుకొని కూర్చుంటిని - ఆ వచ్చిన పంటలోనే తినాలాయ. ఉన్న పదెకరాలూ నా తరువాత మీకొచ్చేదేగా—" అంటూ మొదలెట్టాడు గంగాధరం.

ముఖం చిట్లించుకున్నాడు పెండ్లికొడుకు. "సరే ఇంతకూ ఎంత ఇస్తామంటారు" అని నిగ్గదీశాడు పెండ్లికొడుకు పినతండ్రి.

"అన్ని లాంఛనాలూ గలిపి పదిహేను వందలకన్నా ఎక్కువ ఇవ్వలేని" నిగ్గతేల్చాడు గంగాధరం.

"మరి ఇంతకూ పిల్ల నచ్చిందీ, లేనిదీ చెప్పరేం?" అన్నది రాజమ్మ తలుపు చాటున నుంచొని.

"ఇంటికిపోయి ఉత్తరం రాస్తాం" అంటూ లేచాడు పెండ్లికొడుకు పినతండ్రి.

"తొందరగా ఏ కబురూ తెలియ చెయ్యండి" అన్నాడు గంగాధరం.

చూడవచ్చిన వాళ్ళంతా ప్రయాణమై బయలుదేరారు. ఊరిబయటిదాకా సాగనంపాడు గంగాధరం.

* * * *

మూడువేల రూపాయల కట్నంతో నిశ్చయమైంది వివాహం. గంగాధరం, రాజమ్మల సంతోషానికి మితిలేదు. కానీ రెండెకరాలు అమ్మాలసి వచ్చినందుకు మాత్రం గంగాధరం లోపల విచారపడ్డాడు.

ముహూర్తం రేపనగా విడిదికి చేరారు పెండ్లివారు. వారికి మర్యాదలు చెయ్యటంలో సతమత మయితున్నారు గంగాధరం, రాజమ్మనూ. ఇంటినిండా ఆ రాత్రే మామిడితోరణాలు కట్టారు. రంగుకాయితాలు కత్తిరించి అంటించారు. గంగాధరానికి ఒక్క ఆడపిల్ల. ఆ పిల్ల పెండ్లి నలుగురిలో కొంచెం ఘనంగా చెయ్యాలని. అందుకనే రెండెకరాల పొలాన్ని నాలుగువేల కమ్మాడు గంగాధరం. ఇంట్లో ఇదివరకున్న వెయ్యిరూపాయిలూ పొలంఅమ్మిన నాలుగువేలూ కలసి పిల్ల పెండ్లికి ఖర్చుపెట్టాలని కట్నం మూడు వేలూ పోను మిగతా రెండువేలూ పెట్టి పెండ్లిసరుకులు తెచ్చాడు.

ఇల్లంతా కళకళలాడుతున్నది. తెల్లవారేటప్పటికే ఫలహారాలు పంపాలని తొందర చేయసాగింది రాజమ్మ. లగ్నం పదిగంటలకాయె. అందువల్ల అంతా తొందరలో వున్నారు.

పెండ్లివాళ్లలో అప్పుడే కాఫీ అందలేదనీ, ఫలహారాలు రాలేదనీ ఫిర్యాదులు వచ్చాయి తెల్లవారకముందే!

రాజమ్మ ఆదుర్దాగా ఇదివరకు చేసి వుంచిన లడ్లూ, అరిశలూ, వగైరాలన్నీ తీసి పళ్లాలలో సర్దుతున్నది. వంటబ్రాహ్మడు ఉప్మా, కాఫీ తయారుచేస్తున్నాడు.

ఇంతలోనే గంగాధరాన్ని పిలుస్తున్నారని, పెండ్లివారి చాకలి పిలిచాడు. గంగాధరం పెండ్లివారి విడిదికెళ్లాడు ఆదుర్దాగా.

"ఆడబిడ్డకు వెయ్యినూటపదహార్లివ్వందే పెండ్లి జరగటానికి వీల్లేదు" అంటున్నది పెండ్లికొడుకు తల్లి.

గంగాధరం లోపల ప్రవేశిస్తూనే విన్నాడు పెండ్లికొడుకు తల్లిమాటలు.

"మరి మొదట అనలేదుగా?" అన్నాడు గంగాధరం కొంచెం కటువుగా.

"అనుకోకపోతే మీకు తెలియదూ?" అంటూ దగ్గరకొచ్చింది పెండ్లికొడుకుతల్లి.

"మొదట అనుకోలేదు. ఇప్పుడంటే ఎట్లా?" గంగాధరానికి కోపం వచ్చింది కానీ, తనలోనే ఇముడ్చుకున్నాడు. ఎంతైనా "ఆడపిల్ల తండ్రినే"నని.

"ఏమైనాసరే ఆడబిడ్డ కట్నం వెయ్యినూటపదహార్లూ పడితేనే వరపూజకొస్తాం" అని మూతిముడుచుకుంది పెండ్లికొడుకుతల్లి.

గంగాధరానికి పట్టరానికోపం వచ్చింది. ఏమిచెయ్యాలో తోచలేదు. "వెయ్యినూటపదహార్లు!" తనదగ్గర ఇప్పుడు చిల్లిగవ్వ లేదు. అప్పుకూడా పుట్టదు యీ గ్రామంలో. నిర్ఘాంతపోయాడు పెండ్లివాళ్ల యీ అఘాయిత్యానికి.

నలుగురూ సర్ది చెప్పారు "ఆడపిల్ల తండ్రివి కనక ఇవ్వకతప్పద"ని.

★

గనోక్యూర్
అన్ని సెగలకు గంటలలో గుణము
ఈశ్వర ఫార్మశీ, రాజమండ్రి.